సాక్షి
చిత్తూరు
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



లెప్రసీ కేసులను గుర్తించండి
లెప్రసీ కేసులను సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించాలని టీబీ నోడల్ ఆఫీసర్ వెంకటప్రసాద్ సూచించారు. - 10లో



మనవంతు సాయం
దేశరక్షణలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తున్న సైనికులకు మనవంతు సాయం అందిద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. - 10లో



నిందితుడి అరెస్ట్
కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లిలో బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. - 10లో

న్యూస్‌రీల్

మేళాలో 22 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న గుణశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగులకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పనా కార్యాలయంలో సీడప్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా శాఖ, డీఆర్‌డీఏ శాఖలు సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ మేళాలో 4 బహుళ జాతి కంపెనీలు పాల్గొన్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 57 మంది నిరుద్యోగులు మేళాలో పాల్గొనగా 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మజ, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఏకాంబరం, ఐటీఐ ప్లేస్‌మెంట్ అధికారి మురళీకృష్ణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్

– ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర సచివాలయంలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మంగళవారం బయలుదేరి వెళ్లారు. కాన్ఫరెన్స్‌కు అవసరమైన అజెండా అంశాల సమాచారాన్ని జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సేకరించి కలెక్టర్‌కు నివేదించారు. ఈ నెల 11వ తేదీన ఉదయం సెషన్‌లో గ్రీవెన్స్, ఆర్‌టీజీఎస్, వాట్సాప్ గవర్నెన్స్, జీఎస్‌డబ్ల్యూఎస్‌లు, మధ్యాహ్నం సెషన్‌లో వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యాన, పౌరసరఫరాలు, అటవీ, నీటిపారుదల, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఉపాధి హామీ, గ్రామీణ తాగునీరు, సెర్ప్, మున్సిపల్, శాంతిభద్రతలు అనే అంశాలపై సీఎం చంద్రబాబునాయుడు సమీక్షించనున్నారు. 12వ తేదీ ఉదయం సెషన్‌లో పరిశ్రమలు, ఐటీ, ఐటీఈ అండ్‌సీ, ఐఅండ్‌ఐ, విద్యుత్, మానవవనరుల అభివృద్ధి, రహదారులు, గృహనిర్మాణం, సోషల్‌వెల్ఫేర్, బీసీ, మైనార్టీ సంక్షేమం, ఐసీడీఎస్, రెవెన్యూ (భూములు, రిజిస్ట్రేషన్, స్టాంపులు) ఎక్సైజ్, గనుల శాఖలపై చర్చ నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా అభివృద్ధి ప్రణాళికల అంశంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జేసీ విద్యాధరి వ్యవహరించనున్నారు. 13వ తేదీ నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు.

వ్యాధుల నివారణకు తక్షణ చర్యలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఇటీవల కురిసిన వర్షాలకు డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాపిస్తున్నాయని, వాటి నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి అనిల్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన సబ్ యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అక్కడక్కడ డెంగీ కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో తక్షణం స్పందించి దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని ఆయన చెప్పారు.

● రెండు నెలల కిందట బంగారుపాళ్యం మండలానికి చెందిన 16 ఏళ్ల బాలికకు మండల కేంద్రంలోని ఓ 20 ఏళ్ల యువకుడితో పెళ్లి ఫిక్స్ చేశారు. కుటుంబ పెద్దలు బాధ్యత తీరిపోతుందంటే ఆ బాలిక తల దించుకుంది. ఆలయంలో పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకున్న దగ్గరి బంధువు చిన్న పిల్లలకు పెళ్లి ఏంటని ప్రశ్నించారు. అయినా వినకుండా ఇంటి పెద్ద పట్టుబట్టడంతో బాలిక పెళ్లి పీటలెక్కింది. వెంటనే బంధువు 1098కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అధికారులు వెళ్లి పెళ్లిని అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

● గత నెల 26వ తేదీన 19 ఏళ్ల బాలిక ఆడబిడ్డకు జిల్లా ఆస్పత్రిలో జన్మనిచ్చింది. అయితే ఆ పుట్టిన కొద్ది సేపటికే పిల్లల ఐసీయూకు తరలించారు. తీరా విచారిస్తే 7 నెలలోనే బిడ్డ పుట్టడం, బరువు తక్కువగా ఉండడం, శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నాయని ఆస్పత్రి సిబ్బంది వివరణ ఇచ్చారు. నెల రోజుల పాటు బిడ్డను ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు.



మూడుముళ్లు.. బాల్యానికి సంకెళ్లు

మేలిమి బంగారు మెలతల్లారా..
కలువల కన్నుల కన్నెల్లారా..
తల్లులగన్నా పిల్లల్లారా..
విన్నారమ్మా ఈ కథను.. అంటూ గురజాడ అప్పారావు బాల్యవివాహపు ఉక్కుకోరల్లో చిక్కుకుని బలైపోయిన బాలిక గురించి రాసిన దీనగాథే పుత్తడిబొమ్మ పూర్ణమ్మ కథ. పాషాణ కఠిన కర్కశ హృదయాన్నైనా కరిగించి పారేస్తుంది ఈ కథనం.

పుస్తకాలు పట్టాల్సిన చిట్టి తల్లులు బాల్యంలోనే పెళ్లి పీటలెక్కుతున్నారు. అన్నెంపున్నెం ఎరుగని ఆ పుత్తడి బొమ్మల మెడలో పుస్తెల తాడు ఉరితాడులా మారి ఉచ్చు బిగుస్తోంది. తెలిసీ తెలియని వయసులో పట్టుమని 15 ఏళ్లు కూడా నిండని ఆ పసిపాపలపై సంసార బాధ్యతలు గుదిబండలా మారుతున్నాయి. పేదరికం ఒక వైపు, ఆడపిల్ల భారం తీరుతుందని కన్నోళ్లే సంసారం అనే సాగరంలోకి నెట్టేస్తున్నారు. బాల్యవివాహాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలు, పేద కుటుంబాల్లోనే జరుగుతున్నాయి. చిన్న వయసులోనే గర్భం దాల్చి అనారోగ్యం బారిన పడి జీవితాలు మగ్గిపోతున్నాయి.

జిల్లాలో జోరుగా బాల్య వివాహాలు

- బాధ్యత తీరిపోవాలి అంటూ చిన్నపిల్లలకు పెళ్లిళ్లు చేస్తున్న తల్లిదండ్రులు
- చెదిరిపోతున్న ఆడపిల్ల స్వప్నం
- చేజేతులా బంగారు భవిష్యత్ నాశనం
- చిన్న వయసులోనే గర్భం దాల్చి అష్టకష్టాలు
- మాతాశిశుమరణాలకు ప్రధానం కారణాలు కూడా ఇవే
- ఏటా పెరుగుతున్న బాల్య వివాహాల సంఖ్య
- అడ్డుకట్టకు కిశోర వికాసం కార్యక్రమం

చిత్తూరు రూరల్(కాణిపాకం) : పేదరికం, నిరక్షరాస్యత, కట్టుబాట్లు, సామాజిక రుగ్మతలతో ఆడ పిల్లలను భారంగా భావిస్తున్న కొందరు తల్లిదండ్రులు త్వరగా పెళ్లిళ్ల చేయడానికి మొగ్గు చూపుతుండడంతో చిన్నారుల జీవితాలు ఛిద్రమవుతున్నాయి. బాల్య వివాహాలపై ప్రభుత్వాలు అవగాహన కల్పించినా.. ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా.. ప్రజల్లో పూర్తిస్థాయిలో మార్పు రావడం లేదు. కట్టుబాట్లనే చాదస్తం వల్ల తల్లిదండ్రులు చేసే అనాలోచిత చర్యల వల్ల చిన్నారుల జీవితాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని మారుమూల గ్రామాల్లో బాల్యవివాహాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది మాతా శిశు సంక్షేమ అధికారులు 72 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. అయినా పలుచోట్ల మాత్రం ఇవి ఆగడం లేదు. అధికారులు తమకున్న సమాచారంతో తల్లిదండ్రులకు, బాలికకు అవగాహన కల్పిస్తున్నారు.

దీంతో కొంతవరకు బాల్య వివాహాలు తగ్గినట్టు కనిపిస్తున్నా, అయినా లోలోపల మాత్రం గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారు. కుప్పం, రామకుప్పం, బైరెడ్డిపల్లి, పలమనేరు, వీ.కోట, బంగారుపాళ్యం, నగరి, చిత్తూరు, గుడిపాల తదితర ప్రాంతాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ముహూర్తాల సమయంలోనే గుళ్లు గోపురాలు, ఇళ్ల వద్దే ఈ బాల్య వివాహాలు ఎక్కువగా జరిగిపోతున్నాయని అధికారులు అంటున్నారు.

బాల్య వివాహాల సంఖ్య..

సంవత్సరం	సంఖ్య
2021	34
2022	13
2023	70
2024	72

గర్భిణుల వివరాలు..

సంవత్సరం	గర్భిణులు	చిన్నవయసులో గర్భిణులు
2021–22	33618	286
2022–23	32051	433
2023–24	32571	1014
2024–24	21949	982

బాల్య వివాహం నేరం..
బాల్య వివాహాలను అరికట్టేందుకు కఠినమైన చట్టాలు ఉన్నా అవి చట్టబండలుగానే మిగిలిపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. బాల్య వివాహం చట్టరీత్యా నేరం. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

అడ్డుకట్ట ఇలా..

బాల్య వివాహాలను అడ్డుకునే బాధ్యత గతంలో స్వచ్ఛంద సంస్థ చేతిలో ఉండేది. ఈ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. 1098 టోల్ ఫ్రీ నంబరును అమలు చేసింది. జిల్లాస్థాయిలో చైల్డ్ హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. విజయవాడకు అనుసంధానమైన ఈ సెంటర్.. జిల్లాలో జరిగే బాల్య వివాహాల ఫిర్యాదును జిల్లా సెంటర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ.. అడ్డుకట్ట వేస్తోంది. వీటి నిర్వహణకు జిల్లా కోఆర్డినేటర్, హెల్ప్ డెస్క్‌లో సూపర్‌వైజర్, ఒక కౌన్సిలర్, ముగ్గురు సూపర్ వైజర్లు, ముగ్గురు కేసు వర్కర్లు పనిచేస్తున్నారు. వీరు వచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలోని అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, పోలీసులు, సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేసి బాల్య వివాహాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు.


చైల్డ్ హెల్ప్ సెంటర్ నిర్వహణ కేంద్రం

చిన్నతనంలోనే తల్లిగా..

చిన్న తనంలోనే పెళ్లి చేయడం వల్ల బిడ్డకు తల్లై.. శారీరక సమస్యల బారిన పడుతున్నారు. దీంతో పాటు మాతృమరణాలు, శిశు మరణాలు సంభవిస్తున్నాయి. నెలలు నిండకనే బిడ్డ పుట్టడం, బరువు తక్కువగా పుట్టడం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం, శారీరక లోపాలు.. ఇతరత్రా కారణాలు ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. అలాగే చిట్టి తల్లులు చాలామందికి సుఖ ప్రసవం కాక సిజేరియన్ వైపు మొగ్గు చూపాల్సి వస్తోంది. దీంతో వారు చివరి వరకు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది.

బాల్య వివాహాలకు కారణాలు..

- నిరక్షరాస్యత
- ఆర్థిక కారణాలు..
- కుటుంబ బాధ్యత తీరిపోతుందనే భావన
- బంధుత్వం పోతుందని..
- ఆడపిల్లలు దారి తప్పుతారని..
- ప్రేమ వివాహాలు, మేనరికాలు, వలసలు, వరుడికి ఉద్యోగం ఉందని పరిపక్వత లేని బాల్యాన్ని మాంగల్యంతో బందీ చేస్తున్నారు.
- చదువుకునే సమయంలో ప్రేమ, పెళ్లి వైపు వెళ్తే కుటుంబం పరువు పోతుందనే భయంతో మరి కొందరు ఇలా చేస్తున్నారు.

రిస్క్‌లో పడతారు..



బాల్య వివాహాలు చేయడంతో గర్భం దాల్చిన బాలికలు ఎనీమియా బారిన పడే ప్రమాదం ఉంది. ప్రసవం సమయంలో అధిక రక్తస్రావం, అధిక రక్త పోటుతో ప్రసూతి మరణాలు జరుగుతాయి. బిడ్డను మోసే సామర్థ్యం బాలికలకు తక్కువగా ఉంటుంది. చిన్నవయసులో ప్రెగ్నెన్సీ వల్ల బిడ్డతో పాటు తల్లి ప్రాణానికి కూడా ప్రమాదమే. టీనేజ్ ప్రెగ్నెన్సీ రిస్క్‌తో కూడుకున్నది. అమ్మాయిలకు 21 ఏళ్లలో ప్రసవం మంచిది. – ప్రభావతి దేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

బాల్య వివాహాలను అడ్డుకోవడమే లక్ష్యం



బాల్య వివాహాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వస్తే వెంటనే స్పందిస్తున్నాం. మా బృందాలతో నిజనిజాలను పరిశీలించి వెంటనే ఆ పెళ్లి ఆపడానికి ప్రయత్నిస్తున్నాం. బాల్య వివాహాలను ప్రోత్సహించే వ్యక్తులపై కేసులు పెట్టేలా చట్టాలు ఉన్నాయి. సమాచారం అందించిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంటాయి. – నాగమణి, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్, చిత్తూరు

ఎస్‌ఎస్‌జే షుగర్స్‌కు మండలాల కేటాయింపు

నగరి : నేతమ్స్ షుగర్స్ పరిధిలో ఇదివరకు చెరుకు సాగుచేస్తున్న మండలాలను ఆంధ్రప్రదేశ్ కేన్ కమిషనర్ అమరావతి వారు నెలవాయిలోని ఎస్‌ఎస్‌జే షుగర్స్‌కు కేటాయించినట్లు చిత్తూరు డిప్యూటీ కేన్ కమిషనర్ జాన్ విక్టర్ తెలిపారు. మంగళవారం నగరి డివిజన్ చెరుకు రైతుల సమావేశంలో ఆయన ఈ మేరకు వివరాలను తెలియజేశారు. గత 5 ఏళ్లుగా నింద్ర మండలంలోని నేతమ్స్ షుగర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ మూతబడి ఉన్నందున స్థానికుల వినతి మేరకు దీని పరిధిలో చెరుకు సాగు మండలాలైన పుత్తూరు, నారాయణవనం, నింద్ర, నాగలాపురం, కేవీబీ పురం, విజయపురం, నగరి, పిచ్చాటూరు మండలాలను నెలవాయిలోని ఎస్‌ఎస్‌జే షుగర్స్ అండ్ ప్రాడక్ట్స్ లిమిటెడ్ వారికి తాత్కాలికంగా కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రాంత చెరుకు రైతులు ఈ విషయాన్ని గమనించాలని, ఇతర రాష్ట్రాలకు చెరుకు సరఫరా చేసి నష్టపోవాల్సిన అవసరం లేదన్నారు. ఇకపై ఎస్‌ఎస్‌జే షుగర్స్‌లోనే ఒకవరుస క్రమంలో కటింగ్ పర్మిట్లు పొంది చెరుకు సరఫరా చేసుకోవచ్చన్నారు. ఫ్యాక్టరీ వారు కూడా అక్కడి రైతులకు అందించే అన్ని సౌకర్యాలను, సౌలభ్యాలు ఈ మండలాల రైతులకు కూడా అందుతాయని తెలిపారు. చెరుకు పేమెంట్ల విషయంలో కూడా రైతులకు ఎక్కడా కూడా ఇబ్బంది రాకుండా ఉండేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని మేనేజ్‌మెంట్‌కు కూడా సూచించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌జే షుగర్స్ వైస్ ప్రెసిడెంట్ సి.రాధాకృష్ణన్, అడ్వైజర్ కేన్ ఎం.కృష్ణన్, ఏజీఎం కేన్ కె.వరదరాజన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ కేన్ కమిషనర్

రైతు ద్రోహి చంద్రబాబు


రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నాయకులు బొమ్మగుంట రవి, అజయ్‌కుమార్

- ఆర్థిక సాయం ఎక్కడ బాబూ ?
- అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ఉద్యమబాట
- ఈనెల 13వ తేదీ జిల్లా కలెక్టర్లకు వినతులు
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: దేశానికి వెన్నెముక రైతన్న అన్న విషయాన్ని మరిచిన రైతు ద్రోహి చంద్రబాబు అని, గతంలో వ్యవసాయమే దండగా అన్న దుర్మార్గుడు కూడా ఆయనే అని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. తిరుపతిలోని తన నివాసంలో మంగళవారం ఆయన మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కేవలం అధికార దాహంతో జనసేన, బీజేపీలతో పొత్తులు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా అమలు చేయలేదన్నారు. గతంలో అధికారంలోకి రాగానే ఉచిత కరెంట్‌పై మొదటి సంతకం చేసి తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా కరెంట్ అందించిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. అయితే రైతులకు రూ. 20వేలు ఆర్థిక సాయం అందిస్తానని చెప్పిన చంద్రబాబు మరోసారి రైతులను మోసగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలబడుతుందన్నారు. అందులో భాగంగానే ఈనెల 13వ తేదీన ప్రతి జిల్లాలోని కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించి, ఉద్యమబాట చేపడుతున్నామన్నారు. చిత్తూరు ఉమ్మడి జిల్లా నుంచి తమ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో తిరుపతి జిల్లాలోని కలెక్టర్‌కు తనతో పాటు అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తారన్నారు. అలాగే అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని అబద్ధపు హామీ ఇచ్చిన చంద్రబాబు ఈ 6 నెలల్లోనే రూ.15 వేల కోట్లు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఈ నెల 27వ తేదీన జిల్లాలోని అన్ని డిస్కం ఆఫీసుల వద్ద ధర్నాలు చేసి, వినతిపత్రాలు సమర్పిస్తామని చెప్పారు. అంతకు ముందు 'రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ' పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కూటమిలో అసమ్మతితోనే నాగబాబుకు మంత్రి పదవి ప్రకటన

నాగబాబుకు మంత్రి పదవి ఇస్తానని సాక్ష్యాత్తు సీఎం చంద్రబాబు చెప్పడం కూటమి ప్రభుత్వంలో అసమ్మతి తారాస్థాయికి చేరిందనడానికి నిదర్శనమని భూమన కరుణాకరరెడ్డి అన్నారు. 76 ఏళ్ల దేశ రాజకీయ చరిత్రలో ఇంతవరకు ఏ రాజకీయ పార్టీ ఎవరికీ మంత్రి పదవి ఇస్తామని ముందస్తుగా చెప్పలేదన్నారు. ఎన్టీఆర్ చనిపోయినప్పుడు ఆయన కుమారుడు హరికృష్ణను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నామని కూడా చంద్రబాబు ప్రకటించలేదన్నారు. కానీ ఇప్పుడు నాగబాబుకు మంత్రి పదవి ఇస్తానని చెప్పడం చూస్తే వారి మధ్య ఏ స్థాయిలో విభేదాలు ఉన్నాయో అర్థమవుతుందన్నారు. కేవలం పవన్‌ను బుజ్జగించడానికే నాగబాబుకు మంత్రి పదవి ఇస్తానని చెప్పినట్లు తెలుస్తోందన్నారు. నాయకులు బొమ్మగుంట రవి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం ఇలాకాలో అవినీతి బాగోతాలు

- నకిలీ పట్టాలు సృష్టిస్తున్న కోటచెంబగిరికి చెందిన జగదీష్
- వారం కిందట తహసీల్దార్ ఫిర్యాదుతో విచారించిన పోలీసులు
- విచారణలో బయటపడిన మరో నిందితుడు మురుగేష్
- ఇద్దరినీ విచారిస్తున్న పోలీసులు
- నిందితులను కాపాడేందుకు రంగంలోకి తెలుగు తమ్ముళ్లు

గుడుపల్లె: నకిలీ పట్టాల కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో మరో సూత్రధారి సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి దత్తత తీసుకున్న కంచిబందార్లపల్లెకు చెందిన మురుగేష్ బాగోతం బయటపడింది. వివరాల్లోకి వెళ్తే.. గతవారం నకిలీ పట్టాల కేసులో మండలంలోని కోటచెంబగిరికి చెందిన జగదీష్‌ను తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో కేసు మరో మలుపు తిరిగింది. మరో సూత్రధారి మురుగేష్ సైతం జగదీష్ తరహాలోనే రాజముద్రలు, స్టాంప్ సీల్‌లు, నకిలీ పట్టాలు, ఒన్‌బీలు అడంగల్‌లు సృష్టించి పేదల నుంచి డబ్బులు వసూలు చేసి సొమ్ము చేసుకున్నాడు. వారం వ్యవధిలోనే ఇద్దరు పట్టుబడడంతో ఈ కేసులో ఇంకెంతమంది ఉన్నారో అని పోలీసు లు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిందితులను కాపాడేందుకు తమ్ముళ్ల యత్నాలు..
నకిలీ పత్రాలు కేసులో పట్టుబడిన ఇద్దరినీ కాపాడేందుకు టీడీపీ శ్రేణులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. నిందితుల నుంచి లబ్ధి పొందిన ఆ నాయకులు పార్టీ పెద్దల నుంచి పోలీసులు, రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. కేసు తీవ్రత ఎక్కువ కావడంతో అధికారులు మిన్నకుండిపోతున్నారు.



సీఎం ఇలాకాలో అవినీతి బాగోతాలు

సాక్షాత్తు సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో రోజుకో అవినీతి బయటపడుతోంది. అవినీతికి అడ్డుకట్ట వేయాలని సీఎం పలు మీటింగుల్లో చెబుతున్నా.. కుప్పంలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నకిలీ పట్టా తయారీదారుడు అరెస్టు

కుప్పం: రైతులకు నకిలీ డీ–పట్టాలు ఇచ్చి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన గుడుపల్లె మండలం కోటచెంబగిరి గ్రామానికి చెందిన జగదీష్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నకిలీ పట్టాల విషయంపై గుడుపల్లె తహసీల్దారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేశామన్నారు. నిందితుడు జగదీష్ కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న ఓ జిరాక్స్ సెంటర్‌లో డీ–ఫారాలను జిరాక్స్ తీసుకున్నట్లు తేలిందన్నారు. ఈ మేరకు జిరాక్స్ సెంటర్‌లో 8 ఖాళీ డీ–పట్టాలు, 2 నకిలీ పట్టాలు ఉండడంతో వాటిని సీజ్ చేసి నిందితుడు జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. తహసీల్దారు కార్యాలయం నుంచి డీ–పట్టాలు తీసిస్తామని కొందరు మధ్యవర్తులు రైతులను మోసం చేస్తున్నారని, వారిని నమ్మవద్దంటూ విజ్ఞప్తి చేశారు.

ఉపవర్గీకరణ విచారణకు ఏకసభ్య కమిషన్

చిత్తూరు కలెక్టరేట్ : షెడ్యూల్ కులాల్లోని ఉపవర్గీకరణ అంశంపై విచారణకు భారతదేశ అత్యున్నత న్యాయస్థానం ఏకసభ్య కమిషన్‌ను నియమించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఉపవర్గీకరణ విచారణకు ఏకీకృత కమిషన్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రాను నియమించారన్నారు. సంబంధిత ఏకసభ్య కమిషన్ కార్యాలయం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ మొదటి అంతస్తులో ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎవరైనా సంతకంతో మెమొరాండం, వినతులను వ్యక్తిగతంగా, రిజిస్టర్ పోస్టు, మెయిల్ ద్వారా తెలియజేవచ్చన్నారు. జిల్లా ప్రజలు 2025వ సంవత్సరం జనవరి 9వ తేదీ వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. omcrcrub carrificaotn@fmai.com కు గడువు తేదీలోపు వినతులను పంపాలని డీడీ కోరారు.

క్లుప్తంగా

నిందితులను కఠినంగా శిక్షించండి


మాట్లాడుతున్న శోభారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తన సోదరుడు హరికృష్ణ ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్టు చేసి శిక్షించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ నాయకురాలు ఆర్కే శోభారాణి పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన సోదరుడు చిత్తూరులో నివాసం ఉంటున్నారని, ఆయన గత నెలలో ఆత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. ఆ సమయంలో ఆత్మహత్యకు కారకులైన వారి పేర్లను రాసిన సూసైడ్ నోట్‌ను తాను చిత్తూరు డీఎస్పీకి వాట్సాప్‌లో పంపానన్నారు. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారని ఆరోపించారు. జిల్లా ఎస్పీ స్పందించి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె విన్నవించారు.

సారా ఊట ధ్వంసం

చిత్తూరు అర్బన్: యాదమరి మండలం గొందివారిపల్లిలో సారా స్థావరాలపై మంగళవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు మంగళవారం నిర్వహించారు. దాడుల్లో వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సైనికుల సంక్షేమం..
మనవంతు సాయం


సాయుధ దళాల పతాక దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, సైనిక సంక్షేమ శాఖ అధికారులు (ఫైల్)

దేశ రక్షణలో నిరంతరం ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించే సైనికుల సంక్షేమం కోసం మనవంతు సాయం అందించే సమయం వచ్చింది. దేశం కోసం త్యాగం చేసే వారి సేవలు అజరామరం. అందువల్ల సైనికులకు, వారి కుటుంబాలకు చేయూత అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. యుద్ధభూమి నుంచి తిరిగి వచ్చిన సైనికులకు, వితంతువులు, వారి కుటుంబాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలనే ఉద్దేశంతో జిల్లాలో ఏటా డిసెంబర్‌లో సాయుధ దళాల విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా విరాళాల సేకరించే పనిలో పడ్డారు.

- సాయుధ దళాల పతాక నిధికి విరాళాల సేకరణ
- ఏటా డిసెంబర్‌లో కార్యక్రమం నిర్వహణ
- 2022లో రూ.16 లక్షల నిధులు సేకరించిన ఎన్‌సీసీ కేడెట్లు
- గతేడాది సొంతంగా సేకరించగా వచ్చింది కేవలం రూ.2.25 లక్షలే
- సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి నిధుల వినియోగం
- తమవంతు విరాళాలు అందజేయాలంటున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా సైనిక దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌సీసీ కేడెట్లు విరాళాలు సేకరిస్తున్నారు. ఇందుకు గుర్తుగా చిన్న స్టిక్కర్‌ను చేతికిస్తారు. కార్లు, ఇతర వాహనాలకు కాస్త పెద్ద స్టిక్కర్ అంటించి విరాళాలు అడుగుతారు. ఇలా సేకరించిన ధనాన్ని దేశం కోసం పాటుపడుతున్న సైనిక వ్యవస్థ, వారి కుటుంబం సంక్షేమం కోసం ఖర్చు చేస్తారు. గత సంవత్సరం సేకరించిన విరాళం చిత్తూరు జిల్లా నుంచి రూ.2.25 లక్షలు దాటలేదు. ఎన్‌సీసీ కేడెట్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి సేకరించడం వల్ల 2022లో రూ.16 లక్షల వరకు జమ అయింది. అయితే పలువురు తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఎన్‌సీసీ కేడెట్లు క్షేత్రస్థాయికి వెళ్లి విరాళాలు సేకరించడం ఆపేశారు. దీంతో గత సంవత్సరం రూ.2.25 లక్షలకంటే ఎక్కువ సేకరించలేకపోయారు. ఈ ఏడాది సైతం కార్యాలయాలు, ప్రముఖ స్థలాల్లో, విద్యాసంస్థల వద్ద విరాళం సేకరించే బాక్సును పెట్టి మిన్నకుంటున్నారు. జిల్లాలో ఇలాంటి సైనిక సంక్షేమ కార్యక్రమం ఉందనే విషయం తెలియదనేవారు కోకొల్లలు.

ఉమ్మడి చిత్తూరు సమాచారం	
వార్ విడోస్	15
యుద్ధంలో గాయపడిన మాజీ సైనికులు	10
అన్ని కేటగిరీల మాజీ సైనికులు	11,000

గర్వించే స్టిక్కర్లు..

యువత తమ ద్విచక్ర, ఇతర వాహనాలపై ఆర్మీ అనే అక్షరాలు, సైనిక దళాలకు చెందిన అంశాలు పెట్టుకోవడంపై ఎక్కువ ఆసక్తి చూపుతుంటారు. నిబంధనల కారణంగా ఎక్కువమంది వీటి జోలికి వెళ్లడం లేదు. ఇప్పుడు యువత ముచ్చటపడే సైనిక స్టిక్కర్లను సైనిక సంక్షేమ శాఖ అందుబాటులోకి తెచ్చింది. చిన్నది రూ.2, వాహనానికి అతికించుకునేది అయితే రూ.40 చొప్పున అందుబాటులోకి తెచ్చారు. చిన్న డబ్బాలతో విరాళాల కోసం వచ్చే ఎన్‌సీసీ కేడెట్లకు ఇచ్చే విరాళమేదైనా సైనిక విభాగాలకు నేరుగా చేరుతుంది. ఎక్కువ మంది దాతలు స్పందిస్తే అంత ఎక్కువ సహకారం మన బలగాలకు చెందుతుందని సైనిక సంక్షేమ శాఖ చెబుతోంది.

ఏం చేస్తారంటే..

సైనికులకు 1948లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటుచేసింది. ఇందులో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి, ఆర్మీ, నావికా, వాయుసేన దళాల సైన్యాధ్యక్షులు ఉంటారు. రాష్ట్రస్థాయిలో సైనిక సంక్షేమ నిధికి అధ్యక్షుడిగా రాష్ట్ర గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షుడిగా, వివిధ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. వీరమరణం పొందిన సైనికులతో పాటు సమస్యల్లో ఉన్న వారి కుటుంబీకులకు, క్షతగాత్రులైన సైనికులకు అండగా ఉండేందుకు సాయధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా డిసెంబర్‌లో జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తారు.

విరాళానికి పన్ను మినహాయింపు..

పన్ను మినహాయింపు వర్తించే అంశాల్లో సైనిక సంక్షేమానికి ఇచ్చే విరాళాలకు ప్రముఖ స్థానం ఉంది. ఆదాయపు పన్ను విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు 80 జీ(5)(వీఐ) ఐటీ యాక్ట్ 1961 ప్రకారం పన్ను మినహాయింపు వర్తిస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు. 2025వ సంవత్సరం మార్చి వరకు విరాళాలు అందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. విరాళాలు పంపేవారు జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్, చిత్తూరు, అకౌంట్ నంబర్ 62125384416, గిరింపేట బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్‌0007083కు పంపాలని అధికారులు కోరుతున్నారు. వివరాలకు 8688817824, 08572-228682 నంబర్లలో సంప్రదించవచ్చు.

మాజీ సైనికులకు ప్రయోజనాలు.. రాయితీలు

- గ్రూప్ 2, 4లో రిజర్వేషన్లు
- వివాహానికి ఆర్థిక సాయం రూ.40వేలు (ఇద్దరు కుమార్తెల వరకు)
- మాజీ సైనికుడు మరణిస్తే కుటుంబానికి రూ.10 వేలు, భార్య, కుమారుడు, కుమార్తె మరణించినా అంతే మొత్తం అందజేస్తారు.
- స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు తక్కువ వడ్డీపై రుణ సదుపాయం కల్పిస్తారు.
- ఇళ్ల స్థలాలు కేటాయిస్తారు.
- సీఎస్‌డీ క్యాంటీన్ ద్వారా వ్యాట్ మినహాయింపుపై సరుకులు పొందే అవకాశం
- మాజీ సైనికుల పిల్లల ఉన్నత చదువుకు కోర్సును బట్టి ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.36 వేల వరకు అందిస్తారు. ఇందుకు కోర్సులో చేరిన మొదటి సంవత్సరంలోనే దరఖాస్తు చేసుకోవాలి.

సేవాదృక్పథంతో ఇవ్వాలి..



జిల్లాలోని ప్రతిఒక్కరూ సాయుధ దళాల పతాక నిధికి తమ వంతు విరాళాలు అందజేయాలి. దేశ రక్షణ కోసం ఎంతోమంది సైనికులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తుంటారు. సైనిక వ్యవస్థ ఎంతో గొప్పది. ప్రమాదవశాత్తు యుద్ధాల సమయంలో చాలా మంది సైనికులు ప్రాణాలు కోల్పోతుంటారు. సైనికుల కుటుంబాలను ఆదుకునేందుకు ఏటా సాయుధ దళాల దినోత్సవాన్ని పురస్కరించుకుని విరాళాలు సేకరిస్తారు.

– సుమిత్‌కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు

అందరూ ముందుకు రావాలి



సాయుధదళాల పతాక నిధికి అందజేసే విరాళాలకు పన్ను మినహాయింపు ఉంటుంది. సైనికులు కన్న వారికి..ఉన్న ఊరికి దూరంగా ఉంటూ మాతృభూమి రక్షణకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందిస్తారు. వారి కోసం ప్రతి ఒక్కరూ తమవంతు విరాళాలు అందించాలి. మాజీ సైనికులు, వారి పిల్లల సంక్షేమానికి ఏర్పాటు చేసిన నిధికి విరాళాలు సేకరించే కార్యక్రమం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తున్నాం.

– రాఘవులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి

'తప్పుడు కేసులతో వేధిస్తున్నారు'


లోకాయుక్తకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గోవిందప్ప

రామకుప్పం: తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు తనపై అక్రమంగా కేసు నమోదు చేశారని వేరే విచారణ సంస్థ ద్వారా కేసు దర్యాప్తు చేయాలని రామకుప్పం మండలంలోని 89 పెద్దూరు సర్పంచ్ మల్లిక భర్త గోవిందప్ప మంగళవారం కర్నూలులో లోకాయుక్త సంస్థ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాలు.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 89 పెద్దూరు పంచాయతీ సర్పంచ్‌గా మల్లిక గెలుపొందారని తెలిపారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత తన భార్యను సర్పంచ్ పదవికి రాజీనామా చేయాలని స్థానిక టీడీపీ నేతలు ఒత్తిడి తెచ్చారన్నారు. అదేవిధంగా మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదని, పంచాయతీలో ప్రజలకు అందుబాటులో లేదన్న కారణాలతో సర్పంచ్ మల్లిక చెక్ పవర్‌ను రద్దు చేశారన్నారు. టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గకపోవడంతో తప్పుడు ఫిర్యాదుతో అన్యాయంగా తనపై హత్యాయత్నం కేసు నమోదు చేసి 35 రోజుల పాటు రిమాండ్‌లో ఉంచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసును వేరే విచారణ సంస్థ ద్వారా విచారణ చేసి తనకు న్యాయం చేయాలని గోవిందప్ప కోరారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

కార్వేటినగరం : కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లిలో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ హనుమంతప్ప తెలిపిన వివరాల మేరకు.. గోపిశెట్టిపల్లె దళితవాడకు చెందిన యువకుడు ఓ బాలికను పల్లిపట్టులో సినిమాకు తీసుకెళ్తానని చెప్పి మార్గం మధ్యలో పొలాల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడి పారిపోయాడు. బాలిక తేరుకుని ఊళ్లోకి వెళ్లి కుటుంబ సభ్యులకు జరిగిన అఘాయిత్యాన్ని తెలియజేసింది. ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలికను ఆరోగ్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు సీఐ తెలిపారు.

సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు నిధులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సాక్షి దినపత్రికలో ఇటీవల వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన కూటమి ప్రభుత్వం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులకు నిధులను మంజూరు చేసింది. చిత్తూరు జిల్లాలోని 48 వసతి గృహాల్లో వివిధ మరమ్మతులకు రూ.8.83 కోట్లు, తిరుపతి జిల్లాలో 55 వసతి గృహాలకు రూ.6.34 కోట్లను మంజూరు చేసింది. మంజూరైన నిధులను కలెక్టర్ అనుమతులతో మరమ్మతులు చేపట్టనున్నారు. ప్రధానంగా రెండు జిల్లాల్లోని వసతి గృహాల్లో తాగునీటి సరఫరా, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, తలుపులు, కిటికీలకు మెష్‌లు, పైకప్పులు, ఫ్లోరింగ్, ప్రహరీగోడ పనులు, మరుగుదొడ్లు తదితర మరమ్మతులకు నిధులను వినియోగించనున్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ టర్మ్-1 పరీక్షలు

- జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ పరశురామనాయుడు


పరశురామనాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న ఎస్‌ఏ టర్మ్-1 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ పరశురామనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్-1 (ఎస్‌ఏ టర్మ్-1) పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను ఎస్సీఈఆర్టీ నుంచి పంపిణీ చేశారన్నారు. అయితే కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఎస్సీఈఆర్టీ లేదా ఆయా యాజమాన్యాల సొంత ప్రశ్నపత్రాలతో పరీక్షలను నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశించిందన్నారు. 1 నుంచి 5 వ తరగతి వరకు 11న తెలుగు, ఉర్దూ, 12న ఇంగ్లిష్, 13న గణితం, 16న ఈవీఎస్ పరీక్షలు, అలాగే 6 నుంచి 10వ తరగతి వరకు 11న తెలుగు, ఉర్దూ, 12 న హిందీ, 13న ఇంగ్లిష్, 16న గణితం, 17న భౌతికశాస్త్రం, 18న జీవశాస్త్రం, 19న సాంఘికశాస్త్రం పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రశ్నపత్రాలను ఎంఈఓ కార్యాలయాల నుంచి సంబంధిత షెడ్యూల్ ప్రకారం ఏ రోజుకారోజు గంట ముందుగా హెచ్‌ఎంలు తీసుకెళ్లాలని ఆదేశించారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఈ నెల 22 వ తేదీ లోపు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపాలని, అలాగే మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

గోకులం షెడ్ల నిర్మాణంలో అలసత్వం వద్దు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టండి
- ఆర్‌సీహెచ్‌ఎస్ పోర్టల్ నమోదులో ఎందుకు అలసత్వం ?
- పలు శాఖల అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వరుస సమీక్షలు


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో చేపడుతున్న గోకులం షెడ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి రైతుల అభివృద్ధికి చేపడుతున్న గోకులం షెడ్ల నిర్మాణంలో ఇచ్చిన లక్ష్యాల మేరకు మండలాల్లో పురోగతి సాధించాలన్నారు. పాడి పశువుల పెంపకానికి గోకులం షెడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు. మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టని వారు వారం రోజుల్లో పనులు మొదలు పెట్టేలా చర్యలు చేపట్టాలని, వాటిని రద్దు చేసి మరొకరికి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. షెడ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తయిన పనులకు తప్పనిసరిగా ఎంబుక్ రికార్డు చేయాలని సూచించారు. గోకులం షెడ్ల నిర్మాణానికి నిధుల సమస్య లేదన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో పశుసంవర్థక శాఖ అధికారుల పూర్తి భాగస్వామ్యంతో నిర్మాణాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ప్రభాకర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడాలి

వైద్యశాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. ఆర్‌సీహెచ్‌ఎస్ (రీప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్ సర్వే) పోర్టల్‌లో తల్లి, పిల్లల రిజిస్ట్రేషన్ తక్కువగా ఉండడానికి కారణాలు ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఎన్‌ఎం, ఆశాల సేవలను వినియోగించుకుని డేటాను వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల్లో నమ్మకం పెంచేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగితే సంబంధిత మహిళలకు ఇచ్చే ప్రోత్సాహకాలను సకాలంలో ఖాతాలకు జమచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కాన్పులు తక్కువగా జరుగుతున్న పీహెచ్‌సీల తీరుపై మండిపడ్డారు. పుట్టిన పిల్లలకు ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాలను నూరు శాతం అందజేయాలన్నారు. హైరిస్కు గర్భిణులను గుర్తించి ప్రత్యేక చికిత్స అందించాలన్నారు. మొదటి కాన్పులో ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద రూ.6 వేలు అందజేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణుల చికిత్సకు అవసరమైన అదనపు నిధులను ఖర్చు చేయవచ్చని ఆదేశించారు. సమీక్షలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, డీసీహెచ్‌ఎస్ ప్రభావతి తదితర అధికారులు పాల్గొన్నారు.

లెప్రసీ కేసులను గుర్తించండి

గుడిపాల: గ్రామాల్లో లెప్రసీ కేసులను గుర్తించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ, లెప్రసీ టీబీ నోడల్ ఆఫీసర్ వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. రోజూ నమోదవుతున్న ఓపీల గురించి అడిగి తెలుసుకున్నారు. రెండు వారాలకు మించి పొడి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం లక్షణాలు ఉంటే స్థానికంగా ఉన్న సీఎంసీ ఆస్పత్రిలో ఉచితంగా గల్ల పరీక్ష, ఎక్స్‌రే తీయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,124 మంది స్వామివారిని దర్శించుకోగా 24,069 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.77 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలలో అనుమతించరని స్పష్టం చేసింది.

కోరం లేకుండా సమావేశమా?

కుప్పం: ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశాన్ని రాజ్యాంగ విరుద్ధంగా నిర్వహించారని ఎమ్మార్పీఎస్ నాయకుడు దేవరాజు మాదిగ అన్నారు. నిబంధనల ప్రకారం డివిజనల్ స్థాయి అధికారులతో పాటు కమిటీ సభ్యులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని, కానీ సోమవారం కుప్పంలో నిర్వహించిన సమావేశాన్ని కోరం లేకుండా అధికార పార్టీకి చెందిన నేతలతో నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దళితులు అధికంగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో సమస్యలను అధికారులకు తెలియజేసేందుకు సమావేశంలో సభ్యులకు అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. కేవలం ఐదుగురు సభ్యులు, ముగ్గురు ప్రభుత్వ అధికారులతో సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించారని ఆరోపించారు. ఈ విషయంపై ఆర్డీఓ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ డివిజనల్ స్థాయి చైర్మన్‌గా ఉన్న తాను ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కమిటీలో ఉన్న సభ్యులకు సమాచారం అందించామని, అందరి కోరిక మేరకు సమావేశం నిర్వహించామన్నారు.

బడికి ఆలస్యంగా వస్తే వేటు

- ఆకస్మిక తనిఖీల్లో కొంతమంది టీచర్లు ఆలస్యంగా వస్తున్నట్లు గుర్తించాం
- 'పది' విద్యార్థుల ఉత్తీర్ణత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం
- విలేకరులతో డీఈఓ వరలక్ష్మి


మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఇటీవల తాను పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు కొంతమంది టీచర్లు ఆలస్యంగా హాజరవుతున్న విషయాన్ని గుర్తించామని, వారికి మొదటిసారి హెచ్చరిక ఇచ్చి వదిలేశామని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె డీఈఓ కార్యాలయంలో విలేకరులతో పలు అంశాలను వెల్లడించారు. ఆలస్యంగా వస్తున్న టీచర్లు ఇదే పద్ధతిని కొనసాగిస్తే సస్పెండ్ చేయడం ఖాయమని హెచ్చరించారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ముఖ్య ఆశయమన్నారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఈ నెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సమ్మేటివ్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రాథమిక స్కూల్లో 52,429 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 10,293 మంది, హైస్కూళ్లలో 85,668 మంది పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

జిల్లాలో 311 మంది టీచర్ల సర్దుబాటు..

జిల్లావ్యాప్తంగా నిబంధనల మేరకు 32 మండలాల్లో 311 మంది టీచర్లను కొరత ఉన్న స్కూళ్లకు సర్దుబాటు చేసినట్లు డీఈఓ తెలిపారు. జిల్లాలోని ఏ మండలంలోనూ టీచర్ల కొరత లేకుండా కసరత్తు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాల నివేదికలను సేకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2,462 స్కూళ్ల నుంచి సేకరించే నివేదికలను ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో ప్రాథమిక విద్యార్థుల్లో సామర్థ్యాలు తక్కువగా ఉన్న విషయాన్ని గుర్తించినట్లు చెప్పారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని శుభ్రత నడుమ వండి విద్యార్థులకు పెట్టాలన్నారు.